# ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



ఘట్‌కేసర్ రూరల్: విద్యుత్ దీపాలతో అందంగా అలకరించిన వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం

- అందంగా ఆలయాలు ముస్తాబు
- వేకువజాము నుంచే స్వామివారి దర్శనాలు
- భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 21:** ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు వెంకటాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ ముదిరాజ్ తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్‌లో స్వయంభుగా వెలసి భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగు బంగారంగా నిలిచిన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయాలను ముక్కోటి ఏకాదశి సందర్భంగా విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వార దర్శనంతో పాటు ఆలయంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, వస్త్రాలంకరణ, సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. శనివారం తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయని తెలిపారు.

**ఘట్‌కేసర్‌లో..**

**ఘట్‌కేసర్:** ముక్కోటి ఏకదాశికి శ్రీ వేంకటేశ్వర రంగ నాయక స్వామి ఆలయంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పి.రాజేశ్ గౌడ్ తెలిపారు. పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి,కౌన్సిలర్లు ధనలక్ష్మి కాశయ్య, రాజశేఖర్,ఈఓ భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈనెల 23న ఉదయం 5 గంటల నుంచే వైకుంత ద్వారం నుంచి స్వామివార్ల దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయం వద్ద ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు తీర్ధ ప్రసాదాల వితరణ దేవాదాయ శాఖ నిర్వహిస్తుందని అన్నారు.

**కీసరలో..**

**కీసర:** కీసరలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ నాయకపు వెంకటేశ్ ముదిరాజ్ తెలిపారు.స్వామి దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నామన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు చైర్మన్‌ను నియమించాలి

**పీర్జాదిగూడ, డిసెంబర్ 21:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు చైర్మన్‌ను, పాలక మండలిని రాష్ట్ర ప్రభుత్వం నియమించాలని శ్రీ అభయాంజనేయ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి శేషగిరిరావు పేర్కొన్నారు. గురువారం పీర్జాదిగూడ మేడిపలిలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు చెల్లించాల్సిన రూ.35కోట్ల నిధులను సత్వరం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విదేశీ విద్యను అభ్యసిస్తున్న బ్రాహ్మణ విద్యార్థులు ఇబ్బందులు పడుతారని, వెంటనే నిధులను విడుదల చేసి విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్వీ శర్మ, రేపాక రాంబాబు, అప్పలాచారి, ఘంటసాల వెంకట్‌రావు, బాలకృష్ణ, బాస్కర్, సురేంద్రశర్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు రోహిణి, సత్యవతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.15 లక్షలకు లీజు కైవసం

**శామీర్‌పేట, డిసెంబర్ 21 :** దేవాదాయ ధర్మదాయ శాఖ దేవాలయం భూమిలోని మామిడి, చింత చెట్లు లీజుకు వేలాన్ని కేశవ రెడ్డి కైవసం చేసుకున్నాడు. మూడుచింతల పల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఈవో శ్రీనివాస్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ మైసయ్యాయాదవ్‌లు గురువారం శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని సర్వే నంబర్ 81లోని 7ఎకరాల 30 గుంటల భూమిలో ఉన్న 370 మామిడి చెట్లు, 25 చింత చెట్లు లీజుకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ వేలంలో రూ.3 లక్షల 15 వేలకు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడు ఉడుతల కృష్ణగౌడ్, వార్డు సభ్యుడు శ్రీశైలం, ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 21:** సాంకేతిక రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకమని మైక్రోసాఫ్ట్ టెక్నికల్ మేనేజర్ మణికాంత్ అన్నారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎనిగ్మా సహకారంతో గురువారం కోడ్ విత్‌ఔట్ బ్యారియర్స్ అనే అంశంపై సదస్సు జరిగింది. విద్యార్థులు, సాంకేతికత, వృత్తి, కమ్యునికేషన్ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్ రెడ్డి, ఈవెంట్ సమన్వయ కర్త శిల్ప, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.




సదస్సులో పాల్గొన్న మణికాంత్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు

## సృజనాత్మకత వెలికితీతకు టెక్నికల్ ఫెస్ట్‌లు దోహదం



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ అరుంధతి

**మేడ్చల్,డిసెంబరు 21:** సృజనాత్మకత వెలికితీతకు టెక్నికల్ ఫెస్ట్‌లు దోహదం చేస్తాయని మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి అన్నారు. కళాశాలలో గురువారం సృజన టెక్ ఫెస్ట్ పేరుతో జిల్లా స్థాయి సాంకేతిక సదస్సులు నిర్వహించారు.ఈ పోటీల్లో ఎలక్ట్రికల్ ఆల్టెర్రియన్ వెహికిల్‌కు ప్రథమ బహుమతి, మల్టీపర్పస్ క్లీనింగ్ మెషిన్‌కు ద్వితీయ బహుమతి గెలుచుకొంది.మొదటి బహుమతి సాధించిన విద్యార్థి బృందం సభ్యులు కిరణ్, సాత్విక్, రోహన్, జితేందర్, చైతన్య, రాధేమోహన్ సింగ్, రెండో బహుమతి సాధించిన విద్యార్థి బృందం సభ్యులు హేమంత్‌కుమార్, మహేశ్, బాబు, అభిషేక్, నిఖిల్, రోహిత్ ఆచారి, త్రిశాంత్ సత్యవర్మలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అరుంధతి ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా మనీ, శివ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పీఎన్ రవి, స్నేహలత, లక్ష్మి పవన్‌కుమారి, రెహనబేగం, శ్రీనివాస్, లక్ష్మణ్, గోమతి పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లిలో వికసిత్ సంకల్ప యాత్ర

**శామీర్‌పేట, డిసెంబర్ 21 :** కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జాము రవి సూచించారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజా సంక్షేమానికి కేంద్రం ఎన్నో సంక్షేమాలు చేపడుతుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఏవో కృష్ణవేణి, వైద్యాధికారి దమయంతి, వార్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**మేడ్చల్, డిసెంబరు 21:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ సమావేశం మందిరంలో మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల్లో రూ.56.40 లక్షలతో 21 పనులు చేపట్టేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేశ్, కమిషనర్ టీఎస్‌వీఎస్ త్రిల్లేశ్వర్ రావు, కౌన్సిలర్, అధికారులు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

**శామీర్‌పేట:** భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...బోడుప్పల్‌కు చెందిన కెమిడి కుమారస్వామి(38) శామీర్‌పేట మండల పరిధిలోని మజీద్‌పూర్‌లోని విత్తన కంపెనీలో వెల్డింగ్ పనులు చేసేందుకు వెళ్లాడు. 20 అడుగుల ఎత్తులో ఉండి వెల్డింగ్ పని చేస్తుండగా కింద పడిపోయాడు. దీంతో అతని తలవెనుక భాగంలో బలమైన గాయమైంది. వెంటనే అతడిని గాంధీకి తరలిం చారు. అక్కడి వైద్యులు పరీక్షించి, అప్పటి కే చనిపోయి నట్టు నిర్ధారించారు.పోలీసులు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం..

**ఘట్‌కేసర్,డిసెంబర్21:** మున్సిపాలిటీ నిధులతో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఘట్‌కేసర్ మున్సిపాలటీ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మున్సిపాలిటీ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు,వైకుంఠధామాలు,విద్యుత్,వీధిదీపాల ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిల్ పద్మారావు,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## నకిలీ ఇంటి నంబర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



నాగారంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించి ఇంటి నంబర్ రాసుకున్న నంబర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 21:** అక్రమంగా నిర్మించిన ఇండ్ల గోడలపై నకిలీ ఇంటి నంబర్లు రాసుకుంటే క్రిమినల్ కేసులు కేసులు నమోదు చేయిస్తామని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించిన గోడలపై రాసుకున్న నకిలీ ఇంటి నంబర్లను గురువారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 83, 84 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇండ్లకు మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు మంజూరు చేయనప్పటికీ గోడలపై నకిలీ నంబర్లు రాసుకున్నారని అన్నారు. మున్సిపల్ పరిధిలో నకిలీ ఇంటి నంబర్లురా సుకున్న ఇండ్లను తొలగిస్తామని, మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు పొందకుండా రాసుకున్న వారిపై కేసులు పెడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, అధికారులు రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం..



18వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రామారం శ్రీహరిగౌడ్

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 21:** ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని కౌన్సిలర్ రామారం శ్రీహరిగౌడ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ 18వ వార్డులో గురువారం సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ వార్డులోని ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాలువ పనులను పూర్తి చేశామని, ఈ కార్యక్రమంలో నాయకులు ధన్‌రాజ్ గౌడ్, నరేశ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

**కీసర, డిసెంబర్ 21:** చీర్యాల్‌లోని రోజ్‌గారి భవనం 2వ అంతస్తులో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని గురువారం ఆ గ్రామ నేతలు, యువకులు కోల నవీన్‌యాదవ్, ఏలూరి రాజు పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు.

## డంపింగ్ యార్డులో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

**జవహర్‌నగర్, డిసెంబర్ 21:** డంపింగ్ యార్డులో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... కేశంపేట మండలం నిర్ధవల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ సలాం (58) టిప్పర్ డ్రైవర్. నగరంలోని చెత్తను తీసుకువచ్చి.. డంపింగ్ యార్డ్‌లో డంప్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి టిప్పర్‌లో చెత్తను తీసుకువచ్చిన సలీం.. జాకీతో పైకి లేపుతూ ట్రాలీ వైపు చూస్తున్నాడు. అదే సమయంలో మరో టిప్పర్ డ్రైవర్ రివర్స్ చేసే క్రమంలో అతివేగంగా దూసుకువచ్చి అబ్దుల్ సలాంను ఢీకొట్టాడు. దీంతో సలాం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ వెంకటరమణను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

**బాధిత కుటుంబ సభ్యుల ధర్నా..**

అబ్దుల్ సలాం మృతితో కుటుంబ సభ్యులు.. డంపింగ్ యార్డు గేటు ఎదుట ధర్నాకు దిగారు. న్యాయం చేసి ఆదుకోవాలని ఆందోళన చేశారు.